దివ్యవనాలు - విశిష్టత
54వ భాగం

# జాతక దోషాలను పోగొట్టే దేవకాంచన వృక్షం



జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com

*(గత సంచిక తరువాయి)*

## సరస్వతీ వనం



వృద్ధిర్వృద్ధా విషఘ్నీ చ దృష్టి ర్వృష్టి ప్రదాయినీ।
విశ్వారాధ్యా విశ్వమాతా, విశ్వధాత్రీ వినాయకా॥

విశ్వశక్తి ర్విశ్వసారా, విశ్వా విశ్వవిభావరీ ।
వేదాంత వేదినీ వేద్యా, విత్తా వేదత్రయాత్మికా॥

శ్రీ సరస్వతీదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన పుష్పాలలో ఒకటైన కోవిదారం (దేవకాంచనం) చెట్టు గురించిన విశేషాలు తెలుసుకొం టున్నాం. దానిలో భాగంగా జాతకరీత్యా కలిగే కొన్ని దోషాలకు నివారణోపాయంగా దేవకాంచనం చెట్టుని నాటడం గురించి తెలుసు కొందాం. 'వృక్షశాస్త్రం' అనే తమిళపుస్తకంలో ఈ క్రింది విషయాలు ప్రస్తావించబడ్డాయి.

### కుజ దశలో వచ్చే దోష నివారణ

**బుధ భుక్తి :** కుజదశ నడుస్తుండగా వచ్చే బుధ భుక్తి సమయంలో ఈ గ్రహాలు కనుక అననుకూల స్థానాల్లో వున్నట్లయితే ఆ జాతకునికి చెడు ఫలితాలు కలిగే అవకాశం వుంది. ఆ దోషనివారణ కొరకు దేవకాంచన మొక్కను ఒక గుడిలో గాని, తోటలో గాని లేదా నలుగురుకీ ఉపయోగపడే ప్రాంతంలోగాని నాటాలి.

కుజదశలో బుధ భుక్తి మొదలైన తర్వాత వచ్చే మొదటి బుధవారం నాడు మొక్క నాటేందుకు ఏర్పాటు చేసుకోవాలి. ముందుగానే మొక్క నాటేందుకు అనువైన చోటుని చూసు కొని, మొక్కను తెచ్చి పెట్టుకోవాలి. మొక్కని నాటే ముందురోజు కొన్ని పెసలను నానబెట్టుకోవాలి. మొక్క నాటాక ఆ నీటిని పోయాలి. ఆ పిదప నానిన పెసలను మేకలు, గొర్రెలు లేదా ఆవుకు పెట్టాలి.



### కేతు దశలో వచ్చే దోష నివారణ

**గురు భుక్తి :** కేతుదశలో వచ్చే గురుభుక్తి చెడుఫలితాల నివారణకు కూడా దేవకాంచన చెట్టును నాటడం మంచిది.

పైన చెప్పిన విధంగానే ముందురోజు శనగలు నానబెట్టుకోవాలి. ఆ నీటిని చెట్టుకి పోసి, నానిన శనగలను మేకలు, గొర్రెలు లేదా ఆవులకు పెట్టాలి. ఈ మొక్కని కేతు దశలోని గురు భుక్తి మొదలయ్యాక వచ్చే మొదటి గురువారం నాడు అనువైన చోటులో నాటాలి.



**రాహు భుక్తి :** అదేవిధంగా కేతు దశలో వచ్చే రాహుభుక్తికి కూడా దేవకాంచనాన్ని నాటవలసిందిగా ఈ గ్రంథంలో సూచించారు.

ఇక పురాణాల్లో దేవకాంచనం గురించిన ప్రస్తావనలు చూద్దాం.

### శ్రీ వాల్మీకి రామాయణం

**జెండాపై దేవకాంచన చెట్టు :** మన పురాణాల విషయానికి వస్తే, దేవకాంచనం గురించిన ప్రస్తావన పలు సందర్భాల్లో, వివిధ అడవుల వర్ణనల్లో చూడవచ్చు. ఇప్పుడు మనకి వున్నట్లుగానే పూర్వం కూడా వివిధ రాజ్యాలకు జెండాలు వుండేవి. ఒకే రాజ్యంలోని వివిధ రాజులకి కూడా ప్రత్యేకమైన జెండాలు వుండేవి. వాటిపై దేవతలు, జంతువులు, పక్షులు, చెట్లు, వస్తువులు మొదలైన చిహ్నాలను గమనించవచ్చు.





అర్జునుని జెండాపై కపిరాజు అంటే హనుమంతుడు వుండటం మనందరికీ బాగా సుపరిచితమైన విషయం. అలాగే శ్రీమద్ రామా యణ, భారతాలలో చూసినట్లయితే, శ్రీరామచంద్రుని సోదరుడైన భరతుని జెండాపై దేవకాంచన చెట్టు (కోవిదార వృక్షం) వున్నట్లు మనకు తెలుస్తుంది.

రామాయణంలోని ఈ శ్లోకాలను చూడండి.

శ్లో॥ యథా తు ఖలి దుర్బుద్ధిర్భరతః స్వయమాగతః ।
స ఏష హి మహా కాయః కోవిదార ధ్వజో రథే॥

*(అయోధ్యకాండ 2-84-3)*

ఐశ్వర్యం పోయినా బాధలేదు, జ్ఞానం దిగజారిపోతే సర్వనాశనమే.

అర్థం : రథంపై నున్న ధ్వజంమీద దేవకాంచన చెట్టు వున్నందున, స్వయంగా భరతుడే దుర్బుద్ధితో వస్తున్నట్లుగా వుంది.

శ్లో॥ **ఏష వై సుమహాన్ శ్రీమాన్ విటపీ సంప్రకాషతే ।**
**విరాజిత్య ఉద్గత స్కందః కోవిదార ధ్వజే రథే॥**

(అయోధ్యకాండ 2-96-18)

అర్థం : చాలా గొప్పది, అనేక శాఖలతో ఉప్పొంగుతున్న ప్రకాశం కలిగి వున్న దేవకాంచన చెట్టు చిహ్నం ఆ రథంపైనున్న ధ్వజం మీద విరాజిల్లుతోంది.

శ్లో॥ **అపి నౌ వశం ఆఘచ్ఛేత్ కోవిదార ధ్వజే రణే ।**
**ఆపి ద్రక్ష్యామి భారతమ్ యత్కృతే వ్యసనం మహత్॥**

(అయోధ్యకాండ 2-96-21)

అర్థం : ఓ రామా! దేవకాంచన చిహ్నం గల ధ్వజం వున్న రథం మన పరిధిలోకి ప్రవేశిస్తున్నట్లుంది. చూస్తుంటే నీకు, సీతకు, నాకు ఈ పరిస్థితిని కలిగించిన ఆ భరతుడే స్వయంగా వస్తున్నట్లుంది.





శ్లో॥ **అంకోలాః చ కురంతాః చ పూర్ణకాః పారిభద్రకాః।**
**చుతాః పాటలయః చ అపి కోవిదారాః చ పుష్పితాః॥**

(సుందరకాండ 4-1-8)

అర్థం : అనోల్కం, ముళ్ళగోరింట, పూర్ణక, వేప / బాడిత, మామిడి, కలిగొట్టు, దేవకాంచనం పుష్పించి వున్నాయి.





(చరిత్రకారులు ప్రస్తుత హంపి పరిసర ప్రాంతాలను, రామాయణ కాలం నాటి కిష్కింధగా గుర్తించారు.)

## శ్రీమదాంధ్ర మహాభారతం

శ్లో॥ **శమి పీలు కరీరైష్ చ సంయకౌష్ చైవ భారత**
**ఇంగుదైర్ బదరీభిష్ చ కోవిదారైష్ చ పుష్పితైః**



(ద్రోణపర్వం 7-153-24)

అర్థం : జమ్మి, మెస్వాక్, ఏనుగుదంత, రేల, సాంబ్రాణి చెట్టు, బాదం, రేగు, దేవకాంచనం పుష్పించి వున్నాయి.

## శ్రీమద్భాగవతం

శ్లో॥ **చూత ప్రియాల పనసాసన కోవిదార**
**జంబు అర్క బిల్వ బకుళామ్ర కదంబ నీపః**
**ఏ అన్యే పరార్థ భావక యమునోపకులః**
**సంసాంతు కృష్ణ పదవీం రహితాత్మానం నః** (10-30-9)

అర్థం : మామిడి, సారపప్పు, పనస, పెద్ద వేగిస, దేవకాంచన, నేరేడు, జిల్లేడు, మారేడు, పొగడ, మామిడి, కదంబ, కడిమి చెట్టుల్లారా! యమునాతీరంలో పరుల క్షేమం కోసమే జీవించివున్న కరుణ కలిగిన అన్ని మొక్కల్లారా! కృష్ణుడు కనబడక అయోమయ స్థితిలో వున్న మాకు ఆయన వెళ్ళిన దారిని తెలుపండి.




శ్లో॥ **మందారైః పారిజాతైస్ చ సరళైస్ చ ఉపశోభితం**
**తమాలైః సాల తాళైస్ చ కోవిదార ఆసన అర్జునైః**
**చూతైర్ కదంబైర్ నిపైస్ చ నాగ పున్నాగ చంపకైః**
**పాటల శోక బకుళైః కుందైహ్ కురబకైర్ అపి** (4.6 - 14,15)

చల్లారిన అగ్నిలో ఒక్క నిప్పుకణమున్నా ప్రమాదమే. స్వచ్ఛమైన మనస్సులో ఒక్క చెడుతలంపు వున్నా వినాశనమే.

అర్థం : బాడిత, పారిజాతం, దేవదారులతో శోభిల్లుతోంది. తల్లీష (బిర్యానీ ఆకు), సాల, తాటి, దేవకాంచన, పెద్ద వేగిస, మద్ది, మామిడి, కదంబం, కడిమి, నాగ కేసర, పున్నాగ, మాను సంపంగి, పాదరి, సీతాశోక, పొగడ, కాగడా మల్లి, ముళ్ళ గోరింట కూడా. (ఇవన్నీ కూడా కైలాస పర్వతం మీద శోభిల్లుతూ నిత్యం పుష్పించే వృక్షాలుగా పేర్కొనబడ్డాయి.)









### మహాకవి కాళిదాసు 'ఋతు సంహారం'

శ్లో॥ మంద అనిల అకులిత చారుతర అగ్ర శాఖాః
పుష్ప ఉద్గమ ప్రచాయ కోమల పల్లవ అగ్రః
మత్త ద్వి రేఫా పరిపీత మధు ప్రసేకాః
చిత్తం విదారాయతి కస్య న కోవిదారాః (శరదృతువు 3-6)

అర్థం : బంగారు ఎరుపురంగులోని లేత చిగురాకులతో వున్న చెట్ల అగ్రభాగమందలి దేవకాంచన పుష్ప గుత్తుల్లోంచి పొరలుతున్న మకరందాన్ని మితిమీరి గ్రోలిన తేనెటీగల్ని తాకుతూ, మెల్లగా గాలి వీస్తున్న దృశ్యాన్ని చూసిన వారి హృదయం పులకించక మానదు.


### శ్రీ గర్గ సంహిత

ఈ దివ్యవృక్షాలు శ్రీకృష్ణుని రాసక్రీడకు నెలవైన కామవన వర్ణన లోనివి. శ్రీకృష్ణుడు ఆ వనంలోకి ప్రవేశించే సందర్భం.


శ్లో॥ పటానాం పనసానాం చ పిప్పలానాం వనే శుభే
తులసి కోవిదరానాం కేతకీ కదళి వనే (2-21-3)

అర్థం : శుభకరమైన మర్రి, పనస, రావి అడవులు, తులసి, దేవ కాంచన, మొగలి, అరటి తోటలు...

### ఇతర విశేషాలు

* యజ్ఞంలో సమిధగా దీనిని వాడరాదు. ఈ చెట్టు కింద కూర్చుని చదవరాదని శ్రీకూర్మ పురాణంలో వుంది.
* 'శివమంజరి' అన్న పుస్తకంలో దేవకాంచన పువ్వులు ప్రాతః కాలంలో పూజించే పుష్పాల కోవలో పేర్కొనబడ్డాయి.
* దుర్గాదేవి పూజలో కూడా వీటిని వినియోగించవచ్చని ప్రస్తావించడం చూడవచ్చు.
* ఇంద్రుని నందనవనంలో వుండే ఐదు దివ్య వృక్షాల్లో ఇది ఒకటి.
* 'అభిధన చింతామణి' అన్న తమిళ గ్రంథంలో ఈ దివ్యవృక్షం మంధర ముని అవతారంగా పేర్కొనబడింది. అందుచేతనే ఈ చెట్టుని వారు 'మంధారై' అని పిలుస్తారు.

కాబట్టి ఈ దివ్యవృక్షం ఆనాటి కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యతను కలిగి వుందని రూఢి అవుతోంది.



### దేవకాంచనంపై ఆధునిక శాస్త్ర పరిశోధనలు

* దేవకాంచనం అనేక వైద్యగుణాలు కలిగి వుంది. అవి చాలావరకు ఆయుర్వేదం, పర్వత, అటవీజాతులవారు వాడే నాటు వైద్యాలు. వీటిలో కొన్ని ఆధునిక పరిశోధనల్లో నిరూపించబడ్డాయి.
* ఈ చెట్లు వాతావరణంలోని దుమ్ము, ధూళితో పాటు ఇతర విష పదార్థాలను కూడా సమర్థవంతంగా పీల్చుకొని గాలిని శుభ్రపరచ గల సామర్థ్యం వున్న చెట్లకోవకి చెందినవిగా ఆధునిక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

దేవకాంచనాన్ని కేవలం అందం కోసమే కాకుండా, మన పూర్వీకులను అనుసరిస్తూ, దాని సామర్థ్యం, దివ్యత్వం, విశిష్ట గుణాలను గుర్తించి, ప్రకృతి, మానవాళి శ్రేయస్సు కొరకు వినియోగిద్దాం. మనకు అత్యంత అందుబాటులో వుండే ఈ పుష్పాలతో శివుడు, దుర్గాదేవి, చదువుల తల్లిని పూజించి మన మనోభీష్టాలను నెరవేర్చుకుందాం.

*ఓం సకల మంజులాయై నమః కోవిదార పుష్పం సమర్పయామి* (సశేషం)

ధ్యానతత్పరులైన వారినే దైవం అనుగ్రహిస్తుంది. ఆదరించి రక్షిస్తుంది.